# అపాత్రదానం

తిప్పావఝుల సుబ్రహ్మణ్యం



**పోస్ట్! అన్న కేకతో వాకిట్లోకి వచ్చిన నేను పోస్టుమాన్ అందించిన కవరు అందుకున్నాను. లెటరు చింపి చూశాను. సెప్టెంబరు 5 వ తేదీ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయునిగా నన్ను సత్కరించుటకు జిల్లా కేంద్రంలోని టౌన్ హాలుకు హాజరు కావాల్సిందిగా జిల్లా విద్యాధికారి నుండి వర్తమానం.**

దాదాపు ముప్పది సంవత్సరాలుగా ఎలిమెంటరీ స్కూలు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న నాకు వృత్తిపరంగా ఇప్పటివరకు నా విధిని సక్రమంగా నిర్వర్తిస్తున్నాననే తృప్తి ఉంది. రిటైర్‌మెంటుకు రెండు సంవత్సరాలుంది. విచిత్రమేమిటంటే నేను నా సర్వీసులో దాదాపు పాతిక సంవత్సరాలు మా ఊళ్ళోనే పనిచెయ్యటం. ఇటీవల రిటైర్‌మెంటు తర్వాత శేష జీవితం గడపటానికి వీలుగా స్వంతంగా ఒక ఇల్లు కూడా కొన్నాను.

వృత్తిపరంగా మా స్వగ్రామంలో స్థిరపడ్డ నేను స్కూలు విద్యాభివృద్ధి కొరకు మాత్రమేగాక గ్రామ శ్రేయస్సు కొరకు సహాయపడుతున్నాను. యానాది కులస్థులచే అర్జీలు పెట్టించి, జిల్లా కలెక్టరు వద్దకు వెళ్ళి మా ఊళ్ళో ఎస్.టి. విద్యార్థులకు హాస్టలు ఏర్పరచడానికి చాలా కృషి చేశాను. నిరక్షరాస్యులైన వయోజనులకు విద్యనందించి వారిలో సామాజిక చైతన్యం కలిగించడానికి దోహదపడ్డాను.

హరిజనులు-గిరిజనులు ఎక్కువగా ఉన్న మా గ్రామంలో ప్రతి ఇంటికి పోయి, వారి పిల్లలను బడిలో చేర్పించి, వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దిన నాకు వారి దీవెనలే శ్రీరామ రక్ష. రాజకీయాల జోలికి పోకుండా అందరితో సన్నిహితంగా మెలుగుతున్న నన్ను అందరూ వారిలో ఒకరుగా గౌరవిస్తారు. కుటుంబ సమస్యలు, వ్యక్తిగత సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికీ నా వద్దకు వస్తుంటారు.

జూలై నెలలో మా స్కూలుకు తనిఖీ నిమిత్తం వచ్చిన విద్యాధికారి ఉపాధ్యాయునిగా నా కృషిని గుర్తించి, జిల్లా విద్యాధికారికి రికమెండ్ చేయడం, దరిమిలా నన్ను జిల్లా కేంద్రానికి రమ్మని ఈ లెటరు రావడం జరిగింది.

స్కూలులో సహచర ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు విషయం తెలిసికొని ఎంతో ఆనందించారు. ఆ రోజుల్లో జిల్లా అవార్డు రావడం అరుదు. ఎంతో కృషి చేస్తే గాని అధికార్లు గుర్తించేవారు కాదు.

ఆ రోజు జిల్లా కేంద్రానికి పోయిన నేను జిల్లా విద్యాధికారిని కలిశాను. వారు నాకొక ప్రొఫార్మా అందజేసి విద్యాభివృద్ధికి నేను చేసిన కృషి క్లుప్తంగా రాసి ఇమ్మన్నారు. పూరించి వారికి అందచేశాను.

ఏదో ఆలోచనలో ఉన్న నేను "సార్ బాగున్నారా?" అన్న పిలుపుతో అటు చూశాను. ప్రకాశం! గుత్తిలో పనిచేస్తున్నాడు. ఒక మోస్తరుగా అతనితో పరిచయం. మాటల సందర్భంలో ఆయన కూడా అవార్డు కోసం వచ్చినారని తెలిసింది. నాకు మాత్రం చాలా ఆశ్చర్యం కలిగింది. అతడు బడికి రావడం గగనం అని, వచ్చినా పాఠాలు చెప్పడు సరిగదా నిద్రపోతుంటాడు. ఉద్యోగం చేసే చోట కాపురముండడు. ఈ ఉపాధ్యాయుని కారణంగా రిజల్ట్సు తగ్గాయని చాలామంది చెప్పగా విన్నాను. అలాంటి ప్రకాశం జిల్లా అవార్డుకు ఎలా ఎంపిక చేయబడ్డాడు?

పది సంవత్సరాల క్రితం మాకు ప్రధానోపాధ్యాయుడిగా పని చేసిన శంకరం మాస్టారు కనిపించి, ఉత్తమ ఉపాధ్యాయునిగా తనను సత్కరిస్తారనే విషయం చెప్పగా విచిత్రానుభూతికి లోనయ్యాను. ఇతనికి కొన్ని కారణాల దృష్ట్యా అధికారులు మందలించి, ఫైన్ కూడా కట్టించుకున్నారు. ఆ విషయం నాకు ఇప్పటికి కూడా గుర్తుంది. ఇటీవల కనిపించి స్వంత ఇల్లు కట్టడానికి వీలుగా స్కూలుకు ఆరు నెలలు మెడికల్ లీవు అప్లై చేశానని. కూడా చెప్పాడు. ఈ సమయంలో విద్యార్థుల భవిష్యత్తు ఏమిటి?

ఈ అపాత్ర దానానికి ఏదో రకంగా ఎంపికైనవారు ఇంకెందరో!

ఎందుకనో నా మనస్సు పరిపరివిధాలా ఆలోచనలో పడింది. ఉత్తమ ఉపాధ్యాయులకిచ్చే ఈ సన్మాన కార్యక్రమం పట్ల ఏవగింపు కలిగింది. పనిచేసే చోట కాపురం లేకుండా, కనీస అర్హత లేని వారికి కూడా అవార్డులివ్వడం సబబా? కనీసం గ్రామస్థులను, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సంప్రదించకుండా అధికారులు ఎలా ఎంపిక చేస్తారు? ఇది ఎవరి తప్పు?

హోటల్‌కు పోయి భోజన కార్యక్రమం ముగించుకొచ్చాను. టౌన్ హాల్‌లో కార్యక్రమం ప్రారంభమయింది. కాకతాళీయంగా వేదిక నలంకరించిన ప్రముఖుల ప్రసంగాలు అనంతరం నన్ను అవార్డు స్వీకరణకు ఆహ్వానించడం జరిగింది. ముందుగా నన్ను సభికులనుద్దేశించి మాట్లాడమని కోరారు.

"ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించడం చాలా మంచి సాంప్రదాయం. అయితే సత్కారానికి ఎవరు అర్హులు? అని విచారించి వారికి సన్మానం చేస్తే బాగుంటుందని నా అభిప్రాయం. కనీస అర్హత లేనివారిని సన్మానించడం విద్యాశాఖకే తీరని మచ్చ. నా సర్వీసులో సమాజంలో మంచి ఉపాధ్యాయునిగా గౌరవించబడుతున్న నేను ఈ అవార్డు స్వీకరించి నా స్థానాన్ని దిగజార్చుకోలేను. నన్ను సత్కరించాలని నిర్ణయించుకొన్న అధికారులకు నా ధన్యవాదాలు. కానీ ఈ అవార్డు నేను స్వీకరించలేకపోతున్నందులకు నన్ను క్షమించవలసిందిగా కోరుచున్నాను."

నేను ప్రసంగించుచున్న సమయంలో నన్నే నిశితంగా గమనిస్తున్న జిల్లా అధికారులకు 'నమస్కారం' అని చెప్పి స్టేజీ దిగి, టౌన్ హాలు సమీపమున గల ట్రంకు రోడ్డులో నిలబడి, అప్పుడే వచ్చిన మా ఊరి బస్సు ఎక్కాను.

బస్సు సీటులో కూర్చున్న నాకు ఇప్పుడు ఎంతో తృప్తిగా ఉంది. ✵

## ప్రశాంతి



సుప్రభాతాన శ్రీచరణములను
పదముల పూవుల పూజించి
మాటల మాలల నలంకరించి
వేకువనె వందన మిడి వేడితిని
"ప్రశాంతి" పరమౌషధం యిమ్మని
ప్రతి ప్రభాతం పరిచేటి నీ
చైతన్యపు కాంతిలో తరించు ప్రాణులు
ఈ ప్రభాతాన పరచిన నిర్జీవము,
అచేతనము
తిలకించి, విలపించె
కడలి కదితెనని ఆగ్రహించిన
ఆదిశేషుని
అలల నాల్కల ఉధృతి కాంచితిని
శేషశయనుని శాంత స్వరూపము
కానరాదేమని కలవరపడితిని
ఇది, మా,
కలి అంతమో, యుగాంతమోనని
పరుగులిడితిని భయభ్రాంతినై
ఓ విధాత!
పరమాణువుని నేను, పరమాత్మవు
నీవు
ప్రతి జీవి కోరు పరమ పదము,
నీ చరణయుగళ శరణము
నీ లీల తెలియని నేను నీ స్మరణ
మరచితిని
కబోదినై, బధిరనై, మూగనై,
స్తబ్ధునైతిని
కల్లోల కడలి హననమునకు సేతువైన
"ప్రశాంతి" పరమౌషధ మొసగి
కరుణించుము.

– వి. వాణిమోహన్

